సాక్షి చిత్తూరు

బుధవారం । 27 । ఆగస్టు । 2025

రారండోయ్. వేడుక చూద్దాం!



కాంతులీనుతున్న కాణిపాక ఆలయం

- నేటి నుంచి కాణిపాక వార్షిక బ్రహ్మోత్సవాలు
- శోభాయమానంగా ఆలయం ముస్తాబు
- ఆకట్టుకుంటున్న విద్యుత్, పుష్పాలంకరణలు

కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. బుధవారంతో చవితి ప్రారంభమై సెప్టెంబర్ 16తో ఈ ఉత్సవం ముగియనుంది. నెల రోజుల పాటు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగాయి. ఆలయ క్షేత్రాన్ని శోభయమానంగా తీర్చిదిద్దారు. భక్తుల వసతికి లోటూ లేకుండా అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ముందస్తుగా చర్యలు చేపట్టారు. క్యూలను విస్తరించారు. ఉచిత, శ్రీఘ్ర, అతిశ్రీఘ్ర దర్శనాల క్యూలను పెంచారు. మరింత మందికి అన్నదానం చేసేలా ఏర్పాట్లు చేపట్టారు. ముందస్తు రద్దీ దృష్ట్యా ప్రసాద విక్రయ కేంద్రం వద్ద కూడా క్యూలైన్లు పెట్టారు. మరమ్మతు పనులను పూర్తి చేశారు. ఆలయానికి రంగులు అద్ది.. కొత్త కళను తీసుకొచ్చారు. రథం, వాహనాలకు సైతం రంగులు వేశారు. అలాగే రంగువల్లులు వేసి వాటికి పెయింటింగ్ వేసి ఆకట్టుకునేలా చేశారు. ఇటూ చిత్తూరు నుంచి..అటు తిరుపతి మార్గం నుంచి స్వాగతం పలుకుతూ రోడ్డుకు ఇరువైపులా స్వాగత కటౌట్లను కట్టారు. మరమ్మతులకు గురైన పట్నంరోడ్డును బాగుచేయించారు.

హోమపూజలు, పార్కింగ్

ఆలయ ఆవరణలో హోమ, యజ్ఞ పూజలు సైతం నిర్వహించేందుకు ప్రత్యేక షెడ్డును ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్‌ను ముందస్తుగానే గుర్తించి.. మూడు చోట్ల పార్కింగ్ స్థలాన్ని కేటాయించారు. గణేష్ సేవాసదన్ భవనానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో బస్సులు, పెద్దపెద్ద వాహనాలు నిలిచేందుకు అనువుగా స్థలాన్ని కేటాయించారు. బస్టాండు ఆనుకుని ఉన్న స్థలంలో ఆటోలు, కార్లు పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేపట్టారు. ఈవో నివాస భవనం వెనుక భాగంలో కూడా పార్కింగ్‌కు సిద్ధం చేశారు.

అంతరాలయ దర్శనం రద్దు

చవితిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం అంతరాలయ దర్శనాన్ని రద్దు చేసినట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉదయం నుంచి రాత్రి 10గంటల వరకు స్వామి దర్శనం ఉంటుందన్నారు.



సిద్ధమైన అలంకరణలు

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం




సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కాణిపాకం: వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు అధికారులు ఆదేశించారు. కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై కాణిపాకం ఆలయ ఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, బుధవారం నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆర్డీఓ, డీఎస్పీ, ఆలయ ఈవో ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24/7 కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓ పెంచలకిషోర్, ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎంఅండ్‌హెచ్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వడమాలపేటలో నెమళ్లు ప్రత్యక్షం



వడమాలపేట సద్గురు సన్నిధిలో నెమలి

వడమాలపేట (పుత్తూరు): వడమాలపేట సద్గురు సన్నిధి వద్ద మంగళవారం రెండు నెమళ్లు ప్రత్యక్షమయ్యాయి. విషయం తెలుసుకున్న పాదిరేడు గొల్లపల్లి బీట్ ఆఫీసర్ మునినాయక్ సద్గురు సన్నిధి వద్దకు చేరుకుని పరిశీలించారు. అవి పగటి పూట ఇక్కడకు వచ్చినా రాత్రి వేళకు అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోతాయని సద్గురు సన్నిధి నిర్వాహకులు తెలిపారు.

ఎరువుల దుకాణం తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

నగరి : నగరి మున్సిపల్ పరిధిలో ఉన్న ఎరువుల దుకాణాన్ని మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అధికారి నిరంజన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎరువులు అధిక ధరకు విక్రయించినా, ఇతర రాష్ట్రాలకు తరలించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయాధికారి రామాంజనేయులు, ఏడీఏ కవిత, నగరి ఏవో రాఘవేంద్ర యాదవ్ ఉన్నారు


నిఘా కట్టుదిట్టం



కాణిపాకంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు

కాణిపాకం: బ్రహోత్సవ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు నిఘా వ్యవస్థను పటిష్టం చేశారు. అక్కడక్కడ సీసీ కెమెరాలు బిగించారు. ఆలయం చుట్టూ మూడో కన్ను తెరిచారు. దీనికితోడు ఈసారి డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టనున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడడానికి వివిధ శాఖల అధికారులకు అక్కడ విధులు నిర్వహించేలా కలెక్టర్, ఎస్పీ చర్యలు చేపట్టారు. ఆలయ అధికారులు సైతం ఉత్సవ నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. సమస్యలను పరిష్కరిస్తున్నారు. కాగా ఈ ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, ఈవో పెంచలకిషోర్ పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో పూజిద్దాం



డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి

పుంగనూరు: వినాయక చవితిని ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. ఆది దేవుడిని ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో పూజించి కష్టాలు తొలగిపోయేలా ప్రార్థించాలని సూచించారు.

ఫేక్ సర్టిఫికెట్లపై డేగ కన్ను

- రేపు రెండు కేంద్రాల్లో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన
- పరిశీలనకు ప్రత్యేక బృందాలు

చిత్తూరు కలెక్టరేట్: ఫేక్ సర్టిఫికెట్లపై అధికారులు డేగ కన్ను వేశారు. మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల్లో చాలా వరకు ఫేక్ సర్టిఫికెట్లు ఉన్నట్టు విద్యాశాఖ అధికారులకు ముందస్తు సమాచారం వెళ్లింది. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఈ మేరకు ఈనెల 28న చిత్తూరు జిల్లా కేంద్రానికి సమీపంలోని మురకంబట్టు వద్ద ఉన్న అపోలో యూనివర్సిటీ, ఆర్‌వీఎస్ నగర్‌లో ఉన్న ఎస్వీ సెట్‌లో సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. ఎంపికైన అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌లకు ఈనెల 26 నుంచి కాల్‌లెటర్లను పంపారు.

నకిలీ అయితే క్రిమినల్ కేసే

అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లను సమర్పిస్తే సంబంధిత అభ్యర్థిపై క్రిమినల్ కేస్ నమోదు చేసేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సూచించిన సర్టిఫికెట్లను తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండవన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లు లేకపోయినా...అభ్యర్థులు పరిశీలనకు గైర్హాజరైనా ఉద్యోగం లేనట్టేనని స్పష్టం చేస్తున్నారు. దివ్యాంగులు, క్రీడా కోటా అభ్యర్థుల సర్టిఫికెట్‌లను రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో పరిశీలన చేయనున్నారు. సర్టిఫికెట్ కేంద్రాల్లో అభ్యర్థులకు తప్ప మిగిలిన వ్యక్తులకు, మీడియాకు అనుమతి లేదని డీఈవో వరలక్ష్మి వెల్లడించారు.



MEGA DSC (TEACHER RECRUITMENT TEST) - 2025
CALL LETTER FOR CERTIFICATE VERIFICATION

Date of certificate verification: 28-Aug-2025

Venue: RAYALASEEMA UNIVERSITY, Nandyala Road, Panyam, Kurnool, Andhra Pradesh

Time: 9.00 AM

List of Original Documents to be Produced:

ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులకు పంపిన కాల్‌లెటర్

తీసుకురావాల్సిన సర్టిఫికెట్లు ఇవే

- అభ్యర్థులకు పంపిన కాల్‌లెటర్ కాపీ
- సంబంధిత విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు
- ఇటీవల జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రం (వర్తించినచో).
- అంగవైకల్యం ధ్రువీకరణ పత్రం (వర్తించినచో).
- కాల్‌లెటర్‌లో సూచించిన ఇతర సర్టిఫికెట్లు
- గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన 3 సెట్ల జిరాక్స్ కాపీలు
- 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు

నేత.. మేత!



గ్రావెల్ తరలించడంతో ఎడారిలా మారిన కుమ్మరాయలగుట్ట





గ్రావెల్ తవ్వుతున్న యంత్రాలు

కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. ఇసుక, గ్రానైట్, గ్రావెల్‌ను ఇష్టారాజ్యంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డొచ్చిన అధికారులపై తిరగబడుతున్నారు. ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోకుండా అడ్డదిడ్డంగా దోచేస్తున్నారు. ఇలాంటిదే జీడీనెల్లూరు నియోజకవర్గంలో చోటుచేసుకుంది. శ్రీరంగరాజపురం మండలంలోని 52 కానికపురం రెవెన్యూ లేక్కదాఖలాలో కుమ్మరాయలగుట్టను ఆనుకుని ఉన్న మేతబీడులో అడ్డదిడ్డంగా తవ్వకాలు చేపడుతున్నారు. విలువైన గ్రావెల్‌ను తమిళనాడుకు తరలించి జేబులు నింపుకుంటున్నారు. అధికారులకు తెలిసినా అటు వైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- కుమ్మరాయలగుట్టను కొల్లగొడుతున్న కూటమి నేతలు
- మేతబీడులో ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు
- ఆపై టిప్పర్ల సాయంతో తమిళనాడుకు తరలింపు
- ఒక్కో టిప్పర్ రూ.20 వేల నుంచి రూ.30 వేలకు విక్రయం
- 17 టిప్పర్లు, 3 హిటాచీలను సీజ్ చేసిన అధికారులు

శ్రీరంగరాజపురం: జీడీనెల్లూరు నియోజకవర్గంలో కూటమి నేతలు బరితెగించేశారు. దాదాపు ఏడాదిన్నరగా విలువైన ఖనిజ సంపదను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఆపై తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అక్రమార్కులు కొంత మేర తగ్గించారు. ఇప్పుడు మళ్లీ మొదటికొచ్చేశారు.



చిత్తూరు-తర్చూరు జాతీయ రహదారి గుండా అక్రమంగా తరలుతున్న గ్రావెల్

కన్నేసి..కాజేసి!

శ్రీరంగరాజపురం మండలం, 52 కానికపురం రెవెన్యూ లేక్కదాఖలలో కుమ్మరాయలగుట్ట సర్వే నం.109లో దాదాపు 290 ఎకరాల భూమి ఉంది. ఇందులో కొంత భూమిని 146 మందికి డీకేటీ పట్టాలిచ్చారు. మిగిలిన 144 ఎకరాల భూమి పశువుల మేత బీడుగా ఉంది. కూటమి నేతలు ఆ మేత బీడుపై కన్నేశారు. కుమ్మరాయలగుట్టకు ఆనుకుని ఉన్న గ్రావెల్‌ను రాత్రిపగలు తేడా లేకుండా తవ్వేడం ప్రారంభించారు. ఆపై టిప్పర్ల సాయంతో సరిహద్దులు దాటించి జేబులు నింపుకోవడం అలవాటు చేసుకున్నారు.

తవ్వేస్తూ..తరలిస్తూ

పాతపాళ్యం రెవెన్యూ కుమ్మరాయల గుట్ట నుంచి నేషనల్ హైవేకి 100 మీటర్ల దూరం ఉంది. ఇక్కడి నుంచి తమిళనాడు సరిహద్దు 2 కి.మీలోనే ఉంది. దీన్ని అవకాశంగా తీసుకుని అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. రాత్రి, పగలు తవ్విన కాడికి గ్రెవెల్‌ను అక్రమంగా సరిహద్దులు దాటిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలో ఒక్కో టిప్పర్ గ్రావెల్‌ను ధర రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు విక్రస్తూ పబ్బంగడుపుకుంటున్నారు.

ఫిర్యాదు చేసి..పట్టించేసి!

నేషనల్ హైవే మీదుగా అక్రమంగా గ్రావెల్ తరలుతోందని స్థానికులు కొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు మంగళవారం నేషనల్ హైవే మీదుగా తమిళనాడుకు గ్రావెల్ తరలిస్తున్న 17 టిప్పర్లు, మూడు హిటాచీలను పట్టుకుని సీజ్ చేశారు.

పన్ను కట్టినట్టు చూపిస్తేనే!



52 కానికాపురం కుమ్మరాయలగుట్టలో గ్రెవెల్ తీసుకునేందుకు కేసీసీ బిల్డ్‌కాన్ ప్రైవేటు సంస్థ జిల్లా మైన్స్‌కు దరఖాస్తు చేసింది. ఆ భుమిలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సూచనల మేరకు పరిశ్రమల ఏర్పాటు కోసం కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాము. ఈ క్రమంలోనే గ్రావెల్ తీసుకోవడానికి కొన్ని షరతులతో కూడిన అనుమతులు ఇచ్చాము. కానీ ఇంతవరకు ప్రభుత్వానికి రాయల్టీ పన్ను కట్టిన దాఖలాలు లేవు. అందుకే ఆ వాహనాలను సీజ్ చేశాము. రాయల్టీ పన్ను కట్టినట్టు రసీదులు చూపిస్తే వాహనాలను విడుదల చేస్తాము.

– లోకనాథపిళ్లై, తహసీల్దార్, శ్రీరంగరాజపురం మండలం

ప్రయివేటు లే అవుట్‌కు గ్రావెల్

- ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

విజయపురం : మండలంలోని మహారాజపురం తమిళనాడు సరిహద్దు ప్రాంతంలోని ఓ ప్రయివేటు లేఅవుట్‌కు కూటమి నాయకులు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. సుమారు 20 ఎకరాలు కలిగిన ఈ లేఅవుట్‌కు మట్టి తరలింపు కోసం కూటమి నాయకులు రూ.2 కోట్ల మేర ఒప్పదం కుదుర్చుకున్నట్టు సమాచారం. మంగళవారం మహారాజపురం గుట్ట నుంచి టిప్పర్ల ద్వారా యథేచ్ఛగా గ్రావెల్ తరలించారు. ఒక టిప్పర్ గ్రావెల్ రూ.10 వేల చొప్పున 2000 ట్రిప్పుల గ్రావెల్ తరలించేందుకు డీల్ కుదుర్చుకున్నట్టు సమాచారం. స్థానికులు సంబంధిత రెవెన్యూ అధికారులకు తెలియజేసినా వారు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.



మహారాజపురం కొండలో గ్రావెల్ తవ్వుతున్న యంత్రాలు



ప్రయివేటు లేఅవుట్‌కు తరలించిన గ్రావెల్

ఆర్‌ఎస్‌కేల్లో యూరియా పంపిణీ

పలమనేరు: జిల్లాలోని రైతు సేవాకేంద్రాల ద్వారా యూరియాను పంపిణీ చేయనున్నట్టు డీఏఓ మురళీకృష్ణ తెలిపారు. ఆ మేరకు నియోజకవర్గంలోని పలు ఆర్‌ఎస్‌కేలో సాగుతున్న డీబీటీ(డైరెక్ట్ బెనిఫిషియర్ ట్రాన్స్‌ఫర్) విధానాన్ని పరిశీలించారు. ఆపై పలమనేరులోని మనగ్రామోర్ దుకాణంలో రికార్డులను పరిశీలించారు. ఆర్‌ఎస్‌కేలో బయోమెట్రిక్ చేసుకున్న రైతులకు పండుగ తర్వాత యూరియాను అందిస్తామన్నారు. ఒక్కో ఆర్‌ఎస్‌కేకు సగటున 150 బ్యాగులను ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఆయన వెంట పుంగనూరు ఏడీ శివకుమార్ ఉన్నారు.



ఎరువుల దుకాణంలో డీఏఓ తనిఖీలు

మట్టి వినాయకుడినే పూజిద్దాం



సుమిత్‌కుమార్‌గాంధీ, కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో వినాయకచవితి పండుగను నిర్వహించుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రజలందరికీ వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించాలని కలెక్టర్ సూచించారు.

అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : అంతర్ జిల్లా బదిలీలకు టీచర్లు తమ దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందజేయాలని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తులు చేసుకున్న టీచర్లు సంబంధిత దరఖాస్తులను ఈనెల 28న ఎంఈఓలకు సమర్పించాలన్నారు. ఇందులో ఎలాంటి అలసత్వం వహించకూడదని పేర్కొన్నారు.

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు డ్యూటీలు

చిత్తూరు కార్పొరేషన్: కాణిపాకం బ్రహ్మోత్సవాలకు సంబంధించి అధికారులకు ప్రత్యేక డ్యూటీలు వేశామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. ఈమేరకు సెప్టెంబర్ 16 వరకు వీరు అక్కడ విధులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోజు రెండు షిఫ్టుల ప్రకారం ఏఈ, సబ్‌ఇంజినీర్లు మొత్తం 21 రోజుల పాటు అందుబాటులో ఉంటారన్నారు. విద్యుత్ అంతరాయాలపై చర్యలు తీసుకుంటారని వివరించారు.


ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన మండల నాయకులు

రొంపిచెర్ల: అక్రమ మద్యం కేసులో అరెస్టయిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు విజయవాడ ఏసీబీ కోర్టులో కలిశారు. ఆయన మంగళవారం విజయవాడ ఏసీబీ కోర్టుకు హాజరవుతారని తెలుసుకున్న పలువురు నాయకులు తరలి వెళ్లారు. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తాము మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఎంపీని కలసిన వారిలో జెడ్పీటీసీ రెడ్డిశ్వర్‌రెడ్డి, విజయశేఖర్, కమలాకర్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, యుగంధర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, కరుణాకర్, రెడ్డి శేఖర్‌రెడ్డి, శివారెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనాధనాయుడు, సుధాకర్‌రెడ్డి, సీవీరావు, కుమార్‌నాయుడు ఉన్నారు.

'దారి'కి రాని సయోధ్య!

యాదమరి: మండల పరిధి వరదరాజులపల్లి గ్రామంలో నెలకొన్న దారి వివాదం పరిష్కారం కోసం మండల రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వరదరాజులపల్లి దళితవాడకు చెందిన డేవిడ్ భార్య శశిరేఖ అక్రమంగా తమ పొలంలో కూటమి ప్రభుత్వానికి చెందిన ఓ నేత ఆక్రమించుకుని దారి ఏర్పాటు చేసుకున్నారని గత నెల 21న కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ట్రైనీ కలెక్టర్ బుడితిరెడ్డిపల్లి గ్రామంలోని సదరు పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. అయితే అప్పటి నుంచి ట్రైనీ కలెక్టర్, స్థానిక తహసీల్దార్ పార్థసారథి ఆధ్వర్యంలో పలుమార్లు ఇరువర్గాలతో సయోధ్య కుదర్చడానికి యత్నించారు. ఈ క్రమంలోనే మంగళవారం ఇరుపక్షాలతో మరోమారు మాట్లాడారు. కానీ రాజీ కుదరకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇరుపక్షాల వారు దారి విషయమై చర్చించుకుని స్థానిక రెవెన్యూ అధికారులకు సమాచారం ఇస్తే తదుపరి చర్యలు చేపడుతామని వారు తేల్చి చెప్పారు.

అడగలేక.. నడవలేక



జిల్లా సమాచారం

గ్రామసచివాలయాలు	612
మీ సేవ కేంద్రాలు	189
60-69 వయస్సు గల వృద్ధులు	1,57,433
70-79 వయస్సు గల వృద్ధులు	77,328
80 సంవత్సరాల పైబడిన వృద్ధులు	23,315
మొత్తం వృద్ధులు	2,58,076

దేశ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సేవలు పొందేందుకు గాను 60 ఏళ్లు నిండిన వృద్ధులకు గుర్తింపుగా సీనియర్ సిటిజన్ కార్డును డిజిటల్‌గా అందిస్తున్నారు. ఈ కార్డు ఉంటే వృద్ధులకు వజ్రాయుధం ఉన్నట్టే. అయితే జిల్లాలో ఈ కార్డుల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వృద్ధులు సీనియర్ సిటిజన్ కార్డుల కోసం కాళ్లరిగేలా కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. నడవలేక.. అడగలేక అలసిపోతున్నారు. జిల్లాలో సీనియర్ సిటిజన్ కార్డులకు వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- సీనియర్ సిటిజన్ కార్డులకు అవస్థలు
- మీ-సేవా కేంద్రాల చుట్టూ వృద్ధుల ప్రదక్షిణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 60 ఏళ్లు దాటిన పురుషులు, 58 సంవత్సరాలు పైబడిన మహిళలకు సీనియర్ సిటిజన్ కార్డులను అందజేస్తారు. ఈ కార్డు దేశ వ్యాప్తంగా చెల్లుబాటు అవుతుండడంతో భలే డిమాండ్ ఏర్పడింది. అనాథ వృద్ధులకు ఆశ్రమాల్లో సేవలు పొందేందుకు అవసరమవుతోంది.

సంక్షేమంతో పాటు పలు ప్రయోజనాలు

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ నియోజకవర్గాల పరిధిలో 60 నుంచి 80 సంవత్సరాల పైబడిన వృద్ధులు 2,58,076 మంది ఉన్నారు. వీరు గతంలో జిల్లాలోని సచివాలయాలతో పాటు మీ సేవా కేంద్రాల్లో సీనియర్ సిటిజన్ కార్డులను సులువుగా పొందే అవకాశం ఉండేది. అయితే ప్రస్తుతం గత రెండు నెలలుగా మీ సేవా కేంద్రాల్లో సాంకేతిక కారణాల పేరుతో కార్డులను మంజూరు చేయడం నిలిపివేశారు.

అవస్థలే..అవస్థలు

జిల్లాలోని గ్రామ,వార్డు సచివాలయాల్లో కార్డు పొందేందుకు తాజాగా సర్వీసును పునరుద్ధరించారు. డిప్యూటేషన్, ఇతర పనులను సచివాలయ ఉద్యోగులకు అప్పగిస్తున్నారు. పలు కారణాలతో జిల్లాలోని సగానికి పైగా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. మరోపక్క కార్డు పొందేందుకు బయోమెట్రిక్ ప్రవేశపెట్టడంతో వృద్ధులు వేలి ముద్రలు పడక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాంకేతిక సమస్యల వల్ల కార్డుల జారీ అవ్వక సమస్యలు ఎదుర్కొంటున్నారు. జిల్లా యంత్రాంగం సీనియర్ సిటిజన్ కార్డుల పై అవగాహన కల్పించడంలో విఫలం కావడంతో 80 శాతానికి పైగా వృద్ధులు కార్డులను పొందలేకపోతున్నారు.

సీనియర్ సిటిజన్ కార్డు ప్రయోజనాలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందవచ్చు
- వయసు ధ్రువీకరణ
- ఆర్టీసీ బస్ టికెట్‌లో 25 శాతం రాయితీ
- కేసుల విచారణలో న్యాయస్థానాలు ప్రాధాన్యమిస్తాయి
- బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌లో సేవలు
- పన్ను మినహాయింపు, రాయితీలు పొందవచ్చు
- 60 ఏళ్లు పైబడిన వారికి రూ.3 లక్షల వరకు, 80 ఏళ్లు పైబడిన వారికి రూ.5 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు
- హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై 80 సీ సెక్షన్ కింద పన్ను తగ్గింపు
- వడ్డీ రూపంలో వచ్చే ఆదాయం పై రూ.లక్ష వరకు టీడీఎస్ మినహాయింపు

అర్హత ఇలా..!

జిల్లాలో 60 ఏళ్లు దాటిన పురుషులు, 58 సంవత్సరాలు దాటిన మహిళలు సీనియర్ సిటిజన్ కార్డులు పొందేందుకు అర్హులు. దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం, రక్త గ్రూపు వివరాలు అవసరమవుతాయి.

తిరిగి తిరిగి అలిసిపోతున్నాం



సీనియర్ సిటిజన్ కార్డు కోసం ఇప్పటికి పది సార్లకు పైగా మీ సేవా కేంద్రాల వద్దకు తిరిగాం. ఎన్ని సార్లు తిరిగినా సర్వర్ పనిచేయడం లేదని అంటున్నారు. ఇంకెన్ని సార్లు తిరగాలో అర్థం కావడం లేదు. అధికారులు సమస్యను పట్టించుకుని న్యాయం చేయాలి.

– షణ్ముగ, వృద్ధుడు. పాలసముద్రం మండలం

అవగాహన లేక



సీనియర్ సిటిజన్ కార్డు గురించి ఎవ్వరూ మాకు తెలియజేయలేదు. రెండు రోజుల క్రితం ఒక అయ్యోరు చెబితే తెలిసింది. ఆ తర్వాత మీ సేవా కేంద్రానికి వెళ్లి కార్డుకు దరఖాస్తు చేయాలని కోరాను. సాంకేతిక సమస్య వల్ల దరఖాస్తు చేసేందుకు అవకాశం లేదన్నారు. – ఎత్తిరాజులు, వృద్ధుడు, పాలసముద్రం మండలం

వరసిద్ధునికి విరాళం



విరాళం అందజేస్తున్న బెంగళూరు వాసి



గోసంరక్షణ ట్రస్టుకు విరాళమిస్తున్న మాధవి

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన ట్రస్టుకు మంగళవారం బెంగుళూరుకు చెందిన బాబు రూ.లక్ష, అలాగే కైకలూరుకు చెందిన మాధవి గోసంరక్షణ ట్రస్టుకు రూ. 3లక్షలు విరాళం అందజేశారు. వీరికి ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించారు.

మండపాలకు ఉచిత విద్యుత్

చిత్తూరు కార్పొరేషన్: వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసే మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాలోని వీధుల్లో ప్రతిష్ఠించే ప్రతిమల మండపాలకు తాత్కాలిక విద్యుత్ అనుమతికి ఎవరూ పైకం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అదే విధంగా దసరా పండుగకు ఏర్పాటు చేసే అమ్మవారి మండపాలకు సైతం ఉచిత విద్యుత్ అందించనున్నట్లు వివరించారు.

వివాహానికి వెళ్లి వస్తూ!

- మొగిలి ఘాట్లో ఐచర్ వాహనాన్ని ఢీకొన్న టవేరా
- ఫొటో గ్రాఫర్ మృతి
- 8 మందికి గాయాలు
- అతివేగమే ప్రమాదానికి కారణం!



మృతి చెందిన వినోద్‌కుమార్



మొగిలి ఘాట్‌లో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బంగారుపాళెం: వివాహానికి వెళ్లి వస్తూ మొగిలి ఘాట్ దొరచెరువు వద్ద బెంగళూరు–చెన్నై జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఎనిమిది మంది గాయపడ్డారు. సీఐ శ్రీనివాసులు కథనం.. తమిళనాడులోని వేలూరుకు చెందిన సుల్తాన్‌బాషా కుటుంబ సభ్యులు కారు(టవేరా వాహనం, టీఎన్02వై2975)లో బెంగళూరులో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడి నుంచి మంగళవారం వేకువజామున 2.30 గంటలకు వేలూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో బంగారుపాళెం మొగిలి ఘాట్ దొరచెరువు స్పీడ్‌బ్రేకర్ల వద్ద ఉదయం 5.30 గంటల సమయంలో ముందువెళ్తున్న ఐచర్ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వేలూరు జిల్లా, సోలవరం తాలూకా, పాళెంపాకంకు చెందిన ఫొటోగ్రాఫర్ వినోద్‌కుమార్(45) మృతి చెందాడు. సుల్తాన్‌బాషా, అతని భార్య షబానాభాను, డ్రైవర్ బాలమురళీకృష్ణతో పాటు మరో ఐదుగురు గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. గాయపడిన వారిని హైవే మొబైల్ వాహనంలో పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అందులో నలుగురిని వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారు అతివేగంగా వెళ్లి ముందువెళ్తున్న ఐచర్‌ను ఢీకొనడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బార్లకు 29 వరకు గడువు

చిత్తూరు అర్బన్: జిల్లాలో మద్యం బార్ల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 29వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 11 మద్యం బార్లకు 2025–28 సంవత్సరానికి గాను మూడేళ్ల వరకు లైసెన్సులు మంజూరు చేయడానికి ఇటీవల అధికారులు నోటిఫికేషన్ ఇవ్వగా.. దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం వరకు గడువు ఇచ్చారు. అయితే దుకాణాలకు ఎవ్వరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో ఈ గడువును మరో మూడు రోజులు పొడిగించారు. అలాగే కల్లుగీత సామాజికవర్గానికి చెందిన ఓ దుకాణానికి సైతం 29వ తేదీ వరకు గడువునిచ్చారు. అన్ని బార్లకు శుక్రవారం సాయంత్రం 6 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని, 30వ తేదీ ఉదయం 8 గంటలకు చిత్తూరులోని కలెక్టరేట్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో డిప్ తీసి, లైసెన్సులు కేటాయిస్తామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఇదిలావుండగా మంగళవారం సాయంత్రానికి 11 బార్లకు నాలుగు దరఖాస్తులు మాత్రమే అందాయి. ఒక్కో బార్‌కు తప్పనిసరిగా నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ నిర్వహిస్తామని ఇప్పటికే అధికారులు స్పష్టం చేశారు. నాలుగు దరఖాస్తులు రానిపక్షంలో, లాటరీ రద్దు చేసి.. దరఖాస్తు రుసుము రూ.5 లక్షలు వాపసు ఇస్తామని పేర్కొన్నారు.

సైనికుల్లా పనిచేయండి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మండల నాయకులు

కార్వేటినగరం: క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు యువత నడుం బిగించి సైనికుల్లా పనిచేయాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి, కార్వేటినగరం మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్‌తో పాటు పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి యువత ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. అంధికారం బలంతో అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న రాక్షస పాలనకు స్వస్తిపలకాలని చెప్పారు. వారివెంట జిల్లా సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి కార్తీక్‌రెడ్డి, సోషల్ మీడియా మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, ఐటీ విభాగం మండల ప్రధాన కార్యదర్శి చరణ్ ఉన్నారు.

ఎంపీ విడుదల కావాలని పూజలు



ఆలయాల్లో పూజలు చేసిన దృశ్యం

చౌడేపల్లె: అక్రమ కేసులో అరెస్టయిన రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటపడాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకుడు, బోయకొండ ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్ ఠాణాధర్ నాగరాజ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని శక్తిపీఠం మహంకాళేశ్వరి అమ్మవారికి, కాలభైరవేశ్వర స్వామి, కాళికా అమ్మవారు, ఓంకారేశ్వరస్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేయించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి మంచి జరగాలని ఆలయాల్లో అర్చనలు, అభిషేక పూజలు చేశారు.

కుయ్యో..మొర్రో

ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108



చౌడేపల్లె: కుయ్యో..మొర్రో అంటూ అరుస్తున్నా 108కు దారి ఇవ్వలేదు. మంగళవారం మండల కేంద్రం చవితి సరంజామా కొనుగోలుదారులతో నిండిపోయింది. దీనికితోడు వారపు సంత కావడంతో ఊహించని స్థితిలో రద్దీ నెలకొంది. అదే సమయంలో 108 వాహనం అటువైపు రావడంతో ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. సుమారు అర్ధగంట పాటు అవస్థలు పడాల్సి వచ్చింది.

నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ

కాణిపాకం: చవితిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి మంగళవారం ఓ దాత కూరగాయలు విరాళంగా ఇచ్చారు. అనంతపురం జిల్లాకు చెందిన ఓబులనాయుడు సుమారు ఒకటిన్నర టన్నుల కూరగాయలను విరాళంగా అందజేశారు. అనంతరం ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలు చేశారు. స్వామి దర్శనం కల్పించారు.

1న వరసిద్ధుడికి సారె సమర్పణ

శ్రీకాళహస్తి: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామికి శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున సెప్టెంబరు 1న ముక్కంటి సారె సమర్పించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి సంవత్సరం ఆలయ తరపున సారె సమర్పించడం ఆనవాయితీ అన్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం 7 గంటలకు ఈ సారె అందజేస్తామని చెప్పారు.

డిగ్రీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

తిరుపతి సిటీ : డిగ్రీ ప్రవేశాలపై అయోమయం సృష్టించిన ఉన్నత విద్యామండలి మరోసారి దరఖాస్తులకు వచ్చేనెల 1వతేదీ వరకు గడువు పొడిగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 122 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో ఇప్పటి వరకు 50 శాతం సైతం దరఖాస్తులు రాకపోవడంతో మరోసారి దరఖాస్తు తేదీలను పొడిగించింది. తిరుపతిలోని టీటీడీ కళాశాలల్లో మాత్రమే 80శాతానికి పైగా దరఖాస్తులు రాగా జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 20 శాతం సైతం దరఖాస్తులు అందలేదని ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు.

రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా:స్విమ్స్ నిర్వహిస్తున్న కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సుల ప్రవేశాలకు రెండవ విడత కౌన్సెలింగ్ ప్రక్రియకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28, 29వ తేదీలలో స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు https://svimstpt.ap.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

వివరాలు దాచేస్తూ.. పరిశీలన పేరుతో సాగదీస్తూ!

- గందరగోళంగా మామిడి జాబితా
- బయటపడుతున్న కూటమి బాగోతాలు
- అయోమయంలో రైతులు



ఫ్యాక్టరీలకు క్యూకట్టిన మామిడి ట్రాక్టర్లు (ఫైల్)

కాణిపాకం: జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి గందరగోళంగా మారింది. అష్టకష్టాలు పడి ఫ్యాక్టరీలకు తోలిన మామిడికి ఇంకా ప్రోత్సాహక నిధి రాకపోగా.. పరిశీలన పేరుతో అధికారులు కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 56 వేల హెక్టార్లలో మామిడి సాగు చేయగా.. తోతాపురి రకం 39,895 హెక్టార్లల్లో సాగవుతోంది. తద్వారా 4,9,274 మెట్రిక్ టన్నుల కాయలు దిగుబడి అయినట్టు అంచనా. ఈ పంటను విక్రయించడానికి రైతులు ముప్పుతిప్పలు పడ్డారు. ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాశారు. కూటమి ప్రభుత్వం తోతాపురి కిలోకు రూ.12 మద్దతు ధర ప్రకటించింది. ఇందులో ఫ్యాక్టరీలు రూ.8, ప్రభుత్వ ప్రోత్సాహక నిధిగా రూ.4 నిర్ణయించింది. ఈ ప్రభుత్వ ప్రోత్సాహక నిధిని దోచుకోవడానికి కూటమి నేతలు అడ్డదారులు తొక్కడం కనిపించింది.

ఫ్యాక్టరీ లెక్కల్లో డబుల్ ఎంట్రీలు

జిల్లాలో 43 మ్యాంగో ఫ్యాక్టరీలున్నాయి. వీటిల్లో 31 ఫ్యాక్టరీలు తోతాపురి కాయల కొనుగోలుకు ముందుకొచ్చాయి. గత జూలై మూడో వారం వరకు కాయలు కొనుగోలు చేశాయి. అప్పటి వరకు 49,530 మంది రైతులు 2.31 లక్షల మెట్రిక్ టన్నుల కాయలను తరలించారు. ఈ లెక్కలు తారుమారు కావడంతో పాటు బోగస్‌లున్నాయని కూటమికి చెందిన ఎమ్మెల్యేలే సభలు, సమావేశాల్లో ప్రస్తావించారు. దీనికితోడు సాక్షి దినపత్రికలో సైతం తమిళనాడు కాయలను తీసుకొచ్చి ప్రోత్సాహక నిధి కోసం ఫ్యాక్టరీలకు అమ్ముకున్నారని కథనాలొచ్చాయి. దీనిపై అధికారులు సైతం స్పందించారు. ఆ జాబితాను పరిశీలనకు పెట్టారు. గత రెండు నెలలుగా ఈ పరిశీలన సాగుతోంది. రెండు రోజుల క్రితమే ఫ్యాక్టరీలకు కాయలు తరలించిన రైతుల వివరాలను వెల్లడించారు. ఇందులో డబుల్ ఎంట్రీలు ఉన్నట్టు గుర్తించారు. పంట లేకుండా కాయలు విక్రయించిన రైతు వివరాలను కూడా గుర్తించినట్లు సమాచారం. ర్యాంపు జాబితా పూర్తయినా వెంటనే అధికారులు ఈ గోల్‌మాల్‌ను బయటపెట్టనున్నారు.

ర్యాంపు జాబితా గందరగోళం

జూలై నెలాఖరు వరకు ర్యాంపుల ద్వారా తోతాపురి కొనుగోలు సాగింది. 30,600 మంది రైతులు 1.44 లక్ష మెట్రిక్ టన్నుల కాయలను ర్యాంపులకు విక్రయించారు. ఈ కొనుగోలు లెక్కలు గందరగోళంగా ఉన్నట్లు తెలుస్తోంది. కొంతమంది కూటమి నేతలు తోతాపురి కాయలను ర్యాంపులకు తీసుకెళ్లి వేబిల్లు వేసుకుని కాయలు దింపకుండా.. సిబ్బంది చేతికి వేబిల్లు, ఆధార్, పాసు పుస్తకం మాత్రమే ఇచ్చారు. మళ్లీ మరో ర్యాంపుకెళ్లి ఇదేమాదిరిగానే కాయలు తోలినట్లు పత్రాలు ఇవ్వడం.. తప్పుడు లెక్కల్లోకి ఎక్కించారు. ఇదంతా పలమనేరు, వీ.కోట, బంగారుపాళ్యం వంటి ప్రాంతాల్లో అధికంగా చోటుచేసుకుంది. అలాగే నీలం రకాన్ని కూడా తోతాపురి లెక్కల్లోకి కలిపేశారు. రెండు రోజుల నుంచి ఈ జాబితా లెక్కలను పరిశీలిస్తున్నారు.

రూ.8 మాట ఏమైంది?

మామిడిలోని తోతాపురి రకానికి ఫ్యాక్టరీలు కేజీకి రూ.8 ఇవ్వాలని కూటమి ప్రభుత్వం సూచించింది. ఇవ్వని ఫ్యాక్టరీలను సీజ్ చేస్తామని హెచ్చరికలు జారీచేసింది. అయితే ఇప్పుడు ఫ్యాక్టరీలు తోతాపురికి రూ.5 చొప్పున చెల్లిస్తున్నాయి. దీనిపై ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు లేరు.

కిలో రూ.5నా?



మామిడి సీజన్ ఆరంభంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తోతాపురి కేజీకి రూ.12 చొప్పున మద్దతు ధర ప్రకటించారు. ఇందులో ఫ్యాక్టరీలు కిలోకు రూ.8, ప్రభుత్వం ప్రోత్సాహక నిధికింద రూ.4 చొప్పున ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు. పలు ఫ్యాక్టరీలు రూ.5 మాత్రమే ఇస్తున్నాయి.

–హరిబాబునాయుడు, జిల్లా మామిడి రైతు నాయకుడు, చిత్తూరు మండలం

మద్దతు ధర ఇవ్వాలి



ఫ్యాక్టరీకి 40 టన్నుల తోతాపురి కాయలు తరలించాను. దీనికి ఫ్యాక్టరీ 38 టన్నులకు కిలో రూ.4.9 పైసలు చొప్పున నగదును బ్యాంగు ఖాతాలో జయచేసింది. 12 టన్నుల కాయలకు బిల్లు రావాల్సి ఉంది. వచ్చే ఏడాదికి పెట్టుబడి పెట్టే పరిస్థితి కూడా లేదు.

– కుప్పారెడ్డి, మామిడి రైతు, కార్వేటినగరం మండలం

తిరుమల ఘాట్‌లో తప్పిన ప్రమాదం

- విరిగిపోయిన ఆర్టీసీ బేరింగ్ రాడ్



ప్రమాదానికి గురైన కారు

తిరుమల : ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు ముందు చక్రం బేరింగ్ రాడ్డు విరిగిపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా బస్సును ఆపడంతో భక్తులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు తిరుమల నుంచి తిరుపతికి ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన సప్తగిరి ఎక్స్ ప్రెస్ బస్సు 25 మంది ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరింది. బస్సు 57 మలుపు వద్దకు చేరుకోగా ఆకస్మాత్తుగా బస్సు ముందరి టైరు బేరింగ్ రాడ్ విరిగిపోయింది. దీంతో బస్సు ఒక్కసారిగా రోడ్డుకు రాసుకుంటూ కొంత దూరం వెళ్లి ఆగిపోయింది. బస్సు వేగం తక్కువగా ఉండడంతో బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును ఆపివేయడంతో ప్రయాణికులు పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వెంటనే సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బస్సును పక్కకు తొలగించారు. బస్సులోని ప్రయాణికులను మరో ఆర్టీసీ బస్సులో తిరుపతికి తరలించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

తమిళనాడు చెన్నైకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనార్థం కారులో తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు అనంతరం కారులో మొదటి ఘాట్ రోడ్డు మీదుగా కిందకు దిగుతుండగా 34 మలుపు వద్ద కారు అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొని ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. అయితే కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడం, కారువేగం తక్కువగా ఉండడంతో భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కారు డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతోనే ప్రమాదం చోటుచేసుకున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 67,767 మంది స్వామివారిని దర్శించుకోగా 25,852 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.07 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని, కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని టీటీడీ తెలిపింది.